క్లుప్తంగా

కంకర రోడ్డుపై కష్టాలు



సుల్తాన్‌పూర్ రోడ్డు దుస్థితి

దౌల్తాబాద్: కంకర రోడ్డుతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధి సుల్తాన్‌పూర్ గ్రామం నుంచి నాగసార్ వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర ఉన్న కచ్చరోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఈ మార్గం గుండా గతంలో బీటీ వేసేందుకు జేసీబీతో చదును చేసి, రోడ్డు పక్కన మట్టికుప్పలు పోసి వదిలేశారు. దీంతో ఈ రోడ్డుపై పూర్తిగా కంకర లేలి, నడవానికి కూడా ఇబ్బందిగా ఉందని స్థానికులు చెప్పారు. రోడ్డు వేయడానికి ఎన్నికల కోడ్‌కు ముందే నిధులు మంజూరయినట్లు నాయకులు చెప్పారని, కానీ రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని వాపోయారు. ఉన్న రోడ్డును కాస్త కచ్చరోడ్డుగా మార్చి వదిలేశారని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంత ప్రజలు కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బొంపల్లి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సీఈఓ యాదగిరి

సాక్షి ఎఫెక్ట్..

దోమ: మండల పరిధి పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మంగళవారం 'సాక్షి'లో 'కోతలు సరే.. కొనుగోళ్లేవి?' అనే శీర్షికతో ప్రచురించిన వార్తా కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. బొంపల్లి, బ్రహ్మణపల్లి, కొండాయపల్లి, గుండాల, దిర్సంపల్లి, మోత్కూర్ సెంటర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా.. రైతులకు అవసరమైన గోనె సంచులను అందజేశారు. మరి కొన్ని కేంద్రాలను తెరవాల్సి ఉంది.

బీజేపీతోనే అవినీతి రహితపాలన



ఓటు వేసే విధానం గురించి అవగాహన కల్పిస్తున్న ప్రహ్లాదరావు

కుల్కచర్ల: అవినీతి రహితపాలన బీజేపీకే సాధ్యమని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీజేపీ గెలిస్తే బీసీనే సీఎం చేస్తామని పార్టీ పెద్దలు ప్రకటించారని పేర్కొన్నారు. కావున పార్టీ పరిగి అభ్యర్థి మారుతి కిరణ్‌ను గెలిపించాలని కోరారు.

హస్తం గూటికి ఎంపీటీసీ



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నేతలు

దౌల్తాబాద్: నందారం ఎంపీటీసీ సుగుణమ్మ మంగళవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీటీసీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రశాంత్, రాజగోపాల్‌రెడ్డి ఉన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం

యాలాల: నిధులు, నియామకాలు అంటూ అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ నత్తి రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, ఉద్యోగులు ప్రభుత్వ విధానాలతో క్షోభ పడుతున్నారని చెప్పారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక, వచ్చిన ప్రకటనలకు సంబంధించి పేపర్లు లీకై అభ్యర్థులు మనోవేదనకు గురయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటగా.. ఉద్యోగ నియామకాల క్యాలెండర్‌ను అమలు చేస్తుందని తెలిపారు. యేటా డీఎస్సీ లేదా జంబో డీఎస్సీ తప్పక వేస్తుందని పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి, మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ముగిసిన ప్రచార ఘట్టం

నిన్నమొన్నటి వరకు డప్పు చప్పుళ్లు, మైకుల రోదనలతో సందడిగా ఉన్న పల్లెలు, పట్టణాల్లో నిశ్శబ్దం చోటుచేసుకుంది. సార్వత్రిక ఎన్నికల సమరంలో కీలక ప్రచార ఘట్టమైన ప్రచార పర్వానికి మంగళవారంతో తెరపడగా.. చడిచప్పుడు లేని వాతావరణం చోటుచేసుకుంది. మరో 24 గంటల వరకు ఇదే కొనసాగనుంది. రేపు జరగబోయే పోలింగ్ అనంతరం లెక్కింపు తరువాత అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.



ఆఖరి రోజున హోరు
- పోటాపోటీగా దూసుకెళ్లిన ప్రధాన పార్టీలు
- కదంతొక్కిన గులాబీ శ్రేణులు
- జోరు కొనసాగించిన హస్తం, కమలం

మోమిన్‌పేట/యాలాల: సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఆఖరి రోజు మంగళవారం జిల్లాలో హోరాహోరీగా సాగింది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కండువాల రెపరెపల జోరు కొనసాగింది. పాద యాత్రలు, బైకు ర్యాలీలు, రోడ్ షోలు, ఆటపాటలు, డప్పుల చప్పుళ్లు, బోనాలతో అభ్యర్థుల ఇంటింటి ప్రచారం విస్తృతంగా జరిగింది. నువ్వా నేనా అనే రీతిలో అభ్యర్థులు దూసుకుపోయారు. అధికార పార్టీ నాయకులు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతూ.. ఇంత వరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాల గురించి ఓటర్ల ముందు ఏకరువు పెట్టారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్.. ఆరు గ్యారంటీల మేనిఫెస్టోను ప్రజల ముందు పరిచింది. ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ.. బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను వివరిస్తూ ముందుకు సాగింది. ఆరు దశాబ్దాలుగా తెలంగాణను కాంగ్రెస్సే ఏలిందని, కానీ అప్పుడు ఏం చేయలేదు. ఇప్పుడేం చేస్తారు? మీకెందుకు అవకాశం ఇవ్వాలంటూ గులాబీ శ్రేణులు దూకుడుగా వ్యవహరించారు. అంతే కాకుండా కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఎట్లా ఉండే.. ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ అధికారంలో ఎలా ఉందో ఆలోచించుకొని ఓటు వేయాలని ఓటర్లను కోరారు. తెలంగాణ వచ్చిన పదేళ్ల కాలంలో ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందిందని, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్.. అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలను అమలు చేసి, అర్హులందరికీ అందజేశారని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో నిధులకు వెనకాడకుండా తెలంగాణలో తాగు,సాగు నీటి కష్టాలు తీర్చారని, విద్యుత్, తదితర సమస్యలను తీర్చారని వెల్లడించారు. కాంగ్రెస్‌కు ఓటువేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరగా.. అసలు తెలంగాణ ఇచ్చిందే కాంగ్రెస్సే అని ఆ పార్టీ నేతలు విమర్శనాస్త్రాలను ఎక్కుపెట్టారు. బీజేపీ నేతలు మాట్లాడుతూ.. అవినీతి రహిత పాలన మాతోనే సాధ్యమని, అవకాశం ఇవ్వండని అభ్యర్థించారు. ఇదిలా ఉండగా.. మూడు వారాలుగా ప్రచార పర్వంతో పల్లెలు, పట్టణాలు సందడిగా ఉండగా.. మంగళవారంతో ప్రచార ఘట్టానికి తెరపడింది. దీంతో నేటి నుంచి నిశ్శబ్దం రాజ్యమేలనుంది. ఇక మిగిలింది పోలింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు. ఫలితాల కోసం డిసెంబర్ 3వరకు వేచి చూడాల్సిందే మరి.



యాలాల: బీఆర్‌ఎస్ తాండూరు అభ్యర్థి రోహిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



యాలాల: కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డికి మద్దతుగా..

'దళితబంధు'వుల జీవితాల్లో వెలుగు



సమావేశంలో మాట్లాడుతున్న దళితులు

- ముఖ్యమంత్రి ప్రకటనతో సర్వత్రా హర్షం
- దళిత రత్న అవార్డు గ్రహీత శివరాజ్

నవాబుపేట: చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభలో నియోజకవర్గ దళితులందరికీ ఒకేసారి దళితబంధు ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో.. ఆ సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేస్తోందని దళిత రత్న అవార్డు గ్రహీత శివరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య విన్నపం మేరకు సోమవారం జరిగిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. మరోసారి అధికారంలోకి రాగానే దళితబంధు ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. అదే జరిగితే పేదరికంలో ముగ్గుతున్న దళితులకు అది ఒకవరంలా భావించవచ్చని వెల్లడించారు. అందుకోసం దళితులు బీఆర్‌ఎస్‌కు ఓటువేసి.. మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నం, దళిత నాయకులు ఏసుదాస్, అంజయ్య, జాన్, భాస్కర్, నర్సింహులు, కుమార్, ప్రభాకర్, అశోక్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌పై పెరుగుతున్న వ్యతిరేకత

- కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్న ప్రజలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

మర్పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేక వస్తోందని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బూచన్‌పల్లి, మర్పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరికీ మేలు జరుగుతుందని చెప్పారు. చేతి గుర్తుకు ఓటువేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపిస్తే.. గ్యారంటీ పథకాలతో పాటు, మేనిఫెస్టో అమలు జరిగి సకల జనులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, యూత్ ప్రెసిడెంట్ రాఘవేందర్ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



మోమిన్‌పేట: మొరంగపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పక్కాగా స్కీంలు

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య అన్నారు. మండల పరిధి మొరంగపల్లి గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అందజేస్తుందని పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి, ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

రోహిత్‌రెడ్డి విజయం ఖాయం

తాండూరును అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యేదే
- ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దేముల్: పైలెట్ రోహిత్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య మౌలిక వసతుల కల్పన మాజీ చైర్మన్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం పెద్దేముల్ తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించిన కేసీఆర్ మూడోసారి విజయం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ప్రజల ఆశీర్వాదం కూడా ఉందని పేర్కొన్నారు. తాండూరు అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే రోహిత్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బయటి వ్యక్తులకు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ హైదర్, మాజీ సర్పంచ్ రమేశ్‌కుమార్, విజయలక్ష్మి, సర్పంచ్ లలీత, గ్రామ పెద్దలు అంజి, చంద్రయ్య, సాయిలు, మల్లేశం, ఖాజామియ, నగేశ్, బందయ్య, లాలయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్: ఇంటింటి ప్రచారం చేస్తున్న గులాబీ శ్రేణులు

పైలెట్ గెలుపు పక్కా

యాలాల: ప్రజాభిమానం ఉన్న నాయకుడు రోహిత్‌రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని సర్పంచ్‌ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, బషీర్‌మియాతండా సర్పంచ్ మిత్రునాయక్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. డిసెంబరు 3న వెలువడే ఎన్నికల ఫలితాల్లో రోహిత్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన గెలుపును కోరుతూ 20 రోజులుగా ఒంటిపై చొక్కా, కాళ్లకు చెప్పులు ధరించకుండా దైవదర్శనాలు చేశానని, 3న ఆయన విజయం అనంతరం 4న మొక్కు చెల్లించుకునేందుకు తాండూరు నుంచి కాలినడకన తిరుపతికి వెళ్లనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఘనంగా గరుడ వాహనసేవ

అనంతగిరి: వికారాబాద్ అనంతపద్మనాభ స్వామి ఆలయ కార్తీక మాస పెద్ద జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి గరుడ వాహన సేవ ఘనంగా జరిగింది. వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.



స్వామి వారి సేవలో దేవదాయ ధర్మదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు

కారు, కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశం ఆగమే



ప్రచారం చేస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్

పెద్దేముల్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేస్తే రాష్ట్రం, దేశం ఆగం అవుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన తాండూరు అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్‌కు మద్దతుగా ఆయన మంగళవారం మండల పరిధి గ్రామాల్లో పర్యటించారు. అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే తెలంగాణ వెనుకబాటుకు గురవుతుందని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో కోట్ల రుపాయల నిధులను పక్కదారి పట్టిస్తుందని విమర్శించారు. మూడెకరాల భూమి, నిరుద్యోగుల భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వానికి.. ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ బలపరచిన జనసేన అభ్యర్థి శంకర్‌గౌడ్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్, ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీటీసీపై కేసు నమోదు

పూడూరు: ఓటర్లను ప్రభావితం చేస్తూ, డబ్బులు పంపిణీ చేసిన ఎంపీటీసీపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల పరిధి చీలాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. చన్గోముల్ ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. పలువురు ఓటర్లకు బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి డబ్బులు పంచుతున్నట్లు వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొట్టింది. ఈ మేరకు సీవిజిల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో టాస్కఫోర్సు సిబ్బంది సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి, నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- పోలింగ్ కేంద్రాలు 305
- సమస్యాత్మకమైనవి 72
- ఓటర్లు 2,59,422
- విధుల్లో పాల్గొనేవారు 1830
- పరిగి రిటర్నింగ్ అధికారి విజయకుమారి

పరిగి: రేపు జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పరిగి రిటర్నింగ్ అధికారి విజయకుమారి తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వాటి పరిధిలో 2,59,422 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు పీఓ, ఏపీఓ, ఓపీఎస్‌లకు శిక్షణ కార్యక్రమం పూర్తయిందని, ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో ఆరుగురు సిబ్బంది (ఒక పీఓ, ఒక ఏపీఓ, ఇద్దరు ఓపీఎస్, ఇద్దరు వెబ్‌కాస్టింగ్) విధులు నిర్వహించనున్నారని వెల్లడించారు. మొత్తం 1,830 మంది సిబ్బంది పని చేయనున్నారని ఆర్‌ఓ పేర్కొన్నారు. అందుకు గాను 22 రూట్‌లను ఎంపిక చేసి, 22 రూట్ అధికారులు, 22 మంది సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించామని చెప్పారు.

45 మంది మైక్రోఅబ్జర్వర్లు

సెగ్మెంట్‌లో 72 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, మొత్తం 165 కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని ఆర్‌ఓ స్పష్టం చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు 45 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, ఎప్పటికప్పుడు పోలింగ్ విధానాన్ని పరిశీలించనున్నారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను, వీవీ ప్యాట్‌లను ఇతర సామగ్రిని పంపిణీ చేసేందుకు 22 రూట్లలో మొత్తం 42 బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధుల్లో మొత్తం 456 మంది పోలీస్ సిబ్బంది ఉన్నారని, అందులో ఒకరు సీఎస్పీ, నలుగురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, పోలీస్ కానిస్టేబుల్స్ ఉన్నారని వెల్లడించారు. ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న ఉద్యోగుల్లో ఇతర జిల్లాల నుంచి 1,849 మంది, సొంత జిల్లాలో పనిచేస్తున్న వారు 1,782 మంది ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ వెంకటరామయ్య, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: మాట్లాడుతున్న ఆర్‌ఓ విజయకుమారి



దోమ: బ్రాహ్మణపల్లిలో పోలింగ్ బూత్ పరిశీలన

స్వేచ్ఛగా ఓటు వేయాలి..

దోమ: ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. మండలంలో 45 బూత్‌లు ఏర్పాటు చేశామని, వాటి పరిధిలో 41,901 (పురుషులు 21,182, స్త్రీలు 20,719) మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు పాటించి, ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుదర్శన్, పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాన్యున్ని ఆదరించండి..

కుల్కచర్ల: సార్వత్రిక ఎన్నికల్లో సామాన్యులకు అవకాశం ఇవ్వాలని పరిగి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి ముకుంద నాగేశ్వర్ అన్నారు. మంగళవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యక్తులను చూసి ఓటు వేయాలని, హంగు ఆర్భాటాలతో వచ్చిన వారికి కాదని హితవు పలికారు. సామాన్యుల కష్టాల ఎరిగిన వారిని గుర్తించు, ఓటు వేయాలని కోరారు.

ధైర్యంగా ఓటెయ్యండి..

దోమ: ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటర్లు నిర్భయంగా ఓటును వేయాలని ఎస్ఐ రవి గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోలీసులు కవాతు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఈ ఎన్నికల్లో మంచిగా పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఆనంద్‌కు మరోసారి అవకాశం ఇవ్వండి

అనంతగిరి: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణలో సంక్షేమ పాలన సాధ్యమని బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ సతీమణి సబిత అన్నారు. మంగళవారం వికారాబాద్ మండలం మైలార్‌దేవరాంపల్లి, పీలారం గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎమ్మెల్యేగా తన భర్త ఆనంద్‌కు మరోసారి సేవచేసే అవకాశం కల్పించాలని కోరారు.

ప్రత్యర్థుల గుండెల్లో బీఆర్‌ఎస్ గుబులు



బైకు నడుపుతున్న పైలెట్ రోహిత్ రెడ్డి

- ప్రచారం చూసి హడలెత్తిన ప్రతిపక్షాలు
- లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తా: రోహిత్ రెడ్డి
- మనసున్న మారాజు మా రోహితుడు: సినీ నటుడు మంచు మనోజ్

తాండూరు టౌన్: ఎన్నికల చివరి రోజు ప్రచారంలో బీఆర్‌ఎస్ బైకు ర్యాలీ చూసిన ప్రత్యర్థులకు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ఆ పార్టీ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. ప్రచారం చివరి రోజైన మంగళవారం పట్టణంలో రోహిత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక విలియంమూన్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ.. ఇందిరాచౌక్, గంజ్, గాంధీ చౌక్, భద్రేశ్వర్ చౌక్, రైల్వే గేట్, తెలుగు గడ్డ, నిజాంషాహీ దర్గా, కర్బలా మైదాన్, సీతారాంపేట్, గాంధీనగర్, ముర్షద్ దర్గా, శివాజీచౌక్, ఇందిరాచౌక్, అంబేడ్కర్ చౌక్ వరకు కొనసాగింది. ఇందులో గులాబీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సతీమణి ఆర్తిరెడ్డి స్కూటీ నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. ప్రముఖ సినీ నటుడు మంచు మనోజ్ ఆకర్షణగా నిలిచారు. ఎమ్మెల్యే పైలెట్ బైక్ నడిపి కార్యకర్తలను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా.. తాండూరు ప్రజల ఆదరాభిమానాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. వారి ఆశీర్వాదంతో లక్ష ఓట్లకు పైగా భారీ మెజార్టీతో మరోసారి అసెంబ్లీకి వెళ్తానని ధీమావ్యక్తం చేశారు. దీంతో రోహిత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అని కార్యకర్తలు నినదించారు. నటుడు మనోజ్ మాట్లాడుతూ మనసున్న మారాజు నా మిత్రుడు పైలట్ అని, ప్రజల గురించి ఆలోచించే రోహిత్‌ను మరోసారి గెలిపించాలని కోరారు.

సకుటుంబ సమేతంగా మద్దతు

ఎన్నికల నేపథ్యంలో మూడు వారాలుగా ఎమ్మెల్యే రోహిత్‌కు మద్దతుగా కుటుంబీకులు మొత్తం నియోజకవర్గంలోని గ్రామగ్రామాన పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. పైలెట్ తల్లి ప్రమోదిని, తండ్రి విఠల్ రెడ్డి, సతీమణి ఆర్తిరెడ్డి, సోదరుడు రితేష్ రెడ్డి, బాబాయి శ్రీశైల్‌రెడ్డి రేయింబవళ్లు ప్రచారం కొనసాగించారు. ఇప్పటి వరకు నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిన రోహిత్‌ను మరోసారి అసెంబ్లీకి పంపితే రెట్టింపు వేగంతో మరింత అభివృద్ధి పనులు చేయిస్తాడని వివరించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.